సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



అటు నుంచి ఇటు.. వలస

మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా నుంచి కూలీలు జిల్లాలోని పలు మండలాలకు వలస వస్తున్నారు. పత్తి సేకరణలో ఇంటిల్లిపాది పాల్గొంటూ ఉపాధి పొందుతున్నారు. 8లో▸



ఘనంగా రైతు దినోత్సవం

జాతీయ రైతు దినోత్సవాన్ని జిల్లాలోని బెల్లంపల్లి, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు రైతులకు పూలమాలలు వేసి సన్మానించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /17.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

‘క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సామరస్యానికి క్రైస్తవులు ప్రతీకలని అన్నారు. క్రిస్మస్‌ను క్రైస్తవులు ఆనందంగా జరుపుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉపాధి అవకాశాలు పెంచడానికి, ప్రత్యేకంగా స్వయం ఉపాధి పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు.

మోడల్‌స్కూల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవో యాదయ్యకు ఉద్యోగుల వినతిపత్రం

మంచిర్యాలఅర్బన్: మోడల్‌స్కూల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సోమవారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ సమగ్ర శిక్షలో టైప్–4 కేజీబీవీ మోడల్ స్కూల్ అటాచ్డ్ గర్ల్స్ హాస్టల్‌కు సంబంధించిన ఉద్యోగులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కనీస వేతన స్కేలును అమలు చేయాలని, ప్రతీ ఉద్యోగికి జీవితా బీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.5లక్షల సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, కేజీబీవీ ఎస్‌వోలు స్వప్న, హరిత, సునిత పాల్గొన్నారు.

ఆర్కే6 గనికి ఉత్తమ ఎస్‌డీఎల్ బహుమతి



బహుమతి అందుకుంటున్న మేనేజర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని బెస్ట్ ఎస్‌డీఎల్ ఫర్ఫార్మెన్స్‌లో కంపెనీ స్థాయిలో బహుమతి సాధించింది. సోమవారం కొత్తగూడెంలో జరిగిన సింగరేణి సెంట్రల్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఈ బహుమతిని గని అధికారులకు అందించారు. కంపెనీ సీఎండీ యన్.బలరాంనాయక్ చేతుల మీదుగా గని మేనేజర్ ఈ.తిరుపతి బహుమతి అందుకున్నారు. కంపెనీ వ్యాప్తంగా ఎస్‌డీఎల్ సెక్షన్‌లలో అధిక ఉత్పత్తిని తీసిన గనుల్లో ఆర్కే 6 గని ప్రథమంగా నిలిచింది. కంపెనీ డైరెక్టర్(పీపీ, పా) వెంకటేశ్వర్‌రెడ్డి, గని ఫిట్ ఇంజనీర్‌శ్యాం, ఫిట్ సెక్రెటరీ సంగం సదానందం, ఎస్‌డీఎల్ ఆపరేటర్ సుదర్శన్ పాల్గొన్నారు.

‘హామీలు అమలు చేయాలి’

బెల్లంపల్లి: గిరిజనులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సేవాలాల్ సేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌చంద్ నాయక్ డిమాండ్ చేశారు. రాజ్యాధికారం, సామాజిక న్యాయం, భౌతిక దాడుల నియంత్రణ లక్ష్యంగా ఈ నెల 8న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి నుంచి సేవాలాల్ సేన చేపట్టిన ప్రజారగ్ జోశ్ యాత్ర సోమవారం బెల్లంపల్లికి చేరింది. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాంరా థోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతినాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్ గజానంద్, జిల్లా అధ్యక్షుడు దరావత్ కైలాస్ నాయక్, జిల్లా యూత్ అధ్యక్షుడు రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలప దొంగలెవరు?



ఇటీవల నస్పూర్(పట్టణం విలేజ్ శ్రీరాంపూర్‌లో పట్టుబడిన కలప దుంగలు

ఇటీవల అటవీశాఖ విజిలెన్స్, స్థానిక అధికారుల దాడుల్లో నస్పూర్ పట్టణం ఊరు శ్రీరాంపూర్‌లోని విస్తారాకుల తయారీ కేంద్రంలో భారీగా కలప దుంగలు పట్టుబడ్డాయి. ఇక్కడ గత కొంతకాలంగా అక్రమమార్గంలో కలప తెస్తూ నిల్వ చేస్తున్నారు. ఇంత మొత్తంలో కలప నిల్వ చేస్తున్నప్పటికీ ఇక్కడి అధికారులకు చిక్కలేదు. గతంలో అనేక కలప దొంగతనం కేసులు ఉన్న ఓ వ్యక్తి కొత్త ఇళ్లకు కలప సామగ్రిని తయారు చేసి అమ్మేస్తున్నారు. ఇక్కడ ఒక చోటనే కాకుండా ఓ వ్యక్తి పలు చోట్ల కర్రను నిల్వ చేసినట్లుగా సమాచారం.

- అడవి నుంచి పట్టణాలకు కర్ర
- నిఘా ఉన్నా అరికట్టలేని లోపం
- అటవీ శాఖలోనే సిబ్బంది సహకారం?
- నస్పూర్‌లో పట్టుబడిన దుంగలతో కలకలం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అడవి నుంచి కలప అక్రమ మార్గాల్లో తెస్తూ గృహ, వ్యాపార వినియోగదారులకు అమ్మేస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలకు గుట్టుచప్పుడు కాకుండా దొంగచాటున కలప రవాణా సాగుతోంది. పట్టుబడినప్పుడు మాత్రమే ఇదంతా బయటకు వస్తోంది. అప్పటిదాకా ఎవరికీ చిక్కడం లేదు. తాజాగా నస్పూర్‌లో పట్టుబడిన కలపను బట్టి లోతుగా పరిశీలిస్తే అటవీశాఖ నిత్యం నిఘా పెడుతున్నామని చెప్పే అసలు ఈ దందా ఎలా సాగుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అడవిలో చెట్లను నరికి బయటకు తెచ్చి రోడ్డుమార్గన వాహనాల్లో తర లించి తీసుకు వస్తున్నారు. అటవీ లోపల నుంచి పట్టణ నడిబొడ్డునకు ఎలా చేరుతోందనేది ఆసక్తికరంగా మారింది.

అనుమతి కొంత.. అంతా దందా

ఎవరైనా కలప అవసరం ఉన్న వారు అటవీ శాఖ కలప డిపో, ప్రైవేటు టింబర్ డిపోలు, లాట్‌లో పాల్గొని కొనుగోలు చేసుకోవచ్చు. కర్ర సైజును బట్టి విలువ ప్రకారం చెల్లించాలి. చాలాచోట్ల కొంత మేర అనుమతి తీసుకుని మిగతా అంతా జీరో దందా చేస్తున్నారు. కార్పెంటర్లతో కలిసి కొందరు అక్రమ మార్గాల్లో పట్టణాలకు కలప తీసుకొస్తూ రహస్యంగా నిల్వ ఉంచుతున్నారు. కార్పెంటర్లు, రోజువారీ కూలీలతో అవసరమైన దర్వాజాలు, కిటికీలు, తలుపులు, ఇతరత్రా సామగ్రి తయారు చేస్తున్నారు. ఎక్కడా బయటకు రాకుండా ఇదంతా సాగుతోంది. అంతేకాక మరోవైపు కొత్తగా నిర్మాణం చేపడుతున్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లకు వెళ్లి కొందరు సిబ్బంది వసూళ్లకు తెగబడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ కలప వ్యవహారంపై అటవీ ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎక్కడి నుంచి వస్తోంది?

నిత్యం అటవీ అధికారులు రాత్రీ పగలు గస్తీ.. అటవీ మార్గాలు ఉన్న ప్రధాన రోడ్డుపైన చెక్‌పోస్టులు ఉన్నాయి. అడవుల నుంచి చెట్ల కాండాలు దుంగలుగా మారి ఎలా పట్టణాలకు చేరుతోందనేది ప్రశ్నగా మారింది. కొందరు సిబ్బంది దొంగలతో కుమ్మక్కయి ఈ దందా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.లక్షల విలువ చేసే కర్ర అటవీ సిబ్బంది సాయం లేకుండానే గృహాలకు కిటికీలు, దర్వాజాలు, పర్నిచర్లుగా మారిపోతున్నాయా? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. అటవీశాఖలోనే కొందరు డబ్బులకు ఆశ పడి చూసీచూడనట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల పట్టుబడిన కలప ఓ రేంజీలో కీలకంగా ఉండే ఇద్దరు ముగ్గురు అధికారులే పరోక్షంగా కలప రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఎక్కడా బయట పడకుండా గుట్టుగా పని చేస్తున్నారు. అప్పుడప్పుడు కలప పట్టుబడుతోంది. కొన్నిసార్లు మన అడవుల్లో దొరికినప్పటికీ మహారాష్ట్ర నుంచి తెస్తున్నామని చెబుతూ తప్పించుకుంటున్నారు.

ధాన్యం తరుగు తీస్తున్నారు..!

- బస్తాకు రెండు నుంచి మూడు కిలోలు
- సన్నరకం నచ్చినవైతేనే దించుకోవడం
- మిల్లర్ల తిరకాసుతో రైతుల తిప్పలు
- ధాన్యం అరబెట్టినా.. తూర్పాల పట్టిన కోతే..



హాజీపూర్ మండలంలోని ఓ మిల్లు వద్ద రెండు రోజులుగా ఉన్న ధాన్యం లారీ

మంచిర్యాలఅగ్రికల్చర్: దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ రంగ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని అధికారులు సూచిస్తున్నా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్ల తీరుతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఈ నెల ఆరంభంలో అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టం వాటిల్లింది. ప్రస్తుతం తూకంలో ధాన్యం తరుగు పేరుతో బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు కోత విధిస్తున్నారు. గన్నీ సంచి బరువు కింద తూకం సమయంలో కిలోన్నర వరకు అదనంగా జోకేందుకు రైతులు అంగీకరిస్తుండగా.. మిల్లుకు వెళ్లిన ధాన్యం బస్తాకు రెండు కిలోల తరుగు తీతకు ఒప్పుకుంటేనే దించుకుంటామని రైస్‌మిల్లర్లు తిరకాసు పెడుతున్నారు. దీంతో మిల్లల వద్దనే ధాన్యం లారీలు నిలిచిపోతున్నాయి. రైస్‌మిల్లర్లకు నచ్చిన జైశ్రీరాంతోపాటు కొన్ని రకాల సన్నరకం ధాన్యం అయితే దించుకుంటున్నారు. ఇతర సన్నరకాలు తూకం వేసి మిల్లుకు తరలించినా ధాన్యం దించుకోకుండా వెనక్కి పంపిస్తున్నారు. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఈ నెల 19న 648 బస్తాల ధాన్యం విక్రయించామని, గన్నీ బ్యాగు కింద కిలో 300గ్రాముల చొప్పున అదనంగా ధాన్యం తూకం వేశామని, కొనుగోలు కేంద్రం నుంచి 21న ఎస్ఆర్ఎం రైస్‌మిల్లుకు ధాన్యం తరలించారని, కేంద్రం నిర్వాహకులు, రైస్‌మిల్లర్ కలిసి మళ్లీ అదనంగా బస్తాకు రెండు కిలోల చొప్పున తరుగు తీస్తామని, దీనికి ఒప్పుకుంటేనే ధాన్యం దించుకుంటామని చెబుతున్నారని, రెండ్రోజులుగా ధాన్యం లారీ అక్కడే ఉందని రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా జిల్లాలో పలు మిల్లుల్లో జరుగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

తేమ శాతం తక్కువ ఉన్నా కోతే..

జిల్లాలో ఇప్పటివరకు 7,949 మంది రైతుల నుంచి 49,948 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వారం రోజులకు పైగా ఆరబెడుతూ, తూర్పాలు పడుతూ తాలు, తప్ప వ్యర్థపదార్థాలు తొలగించినా రైతులకు మిల్లర్ల తరుగు కోత తప్పడం లేదు. తేమ శాతం 17 కన్న తక్కువ ఉన్నా తప్ప, తాలు పేరుతో కొర్రీలు పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు వెళ్లిన ధాన్యం అన్‌లోడ్ చేయకుండా రోజుల తరబడి లారీలను నిలిపి ఉంచుతున్నారు. 40కిలోల బస్తాలో రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగుతో కోత పెడుతూ అన్‌లోడ్ చేసుకుంటున్నారు. మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి క్వింటాకుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2305 నిర్ణయించారు. క్వింటాల్‌కు ఆరు కిలోల కోతతో రైతులు రూ.138 చొప్పున నష్టపోతున్నారు.

బస్తాకు రెండు కిలోలు..



హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు రైతులం 648 బస్తాలు ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఈ నెల 19న తూకం వేశాం. తాలు తప్ప లేకుండా తూర్పాల పట్టాం. తేమ శాతం 17లోపే వచ్చింది. గన్నీ సంచి బరువు కింద బస్తాకు కిలో 300గ్రాముల చొప్పున అదనంగా ధాన్యం తూకం వేశాం. సెంటర్ వాళ్లు 21న ఎస్ఆర్ఎం మిల్లుకు ధాన్యం తరలించారు. బస్తాకు రెండు కిలోల కోతకు ఒప్పుకుంటే దించుకుంటామని చెప్పారు. ఇదేంటని అడుగుతే దించుకోబోమని ధాన్యం లారీ వెనక్కి తీసుకుపోవాలని అంటున్నారు. అక్కడ లారీ రెండు రోజులుగా ఉంది. మిల్లర్ల తరుగు తీతను అడ్డుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.

– ధాన్యం రైతులు రాపల్లి

ప్రైవేటుకు అమ్ముకుని నష్టపోయిన..



నర్సింగాపూర్ సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రంలో 9శాతం తేమ వచ్చింది. 48 బస్తాలు 19.20 క్వింటాళ్లు తూకం వేసిన.. నా స్వంత ఖర్చులతో ట్రాక్టర్ ద్వారా సెంటర్‌కు కేటాయించిన నర్సింగాపూర్‌లోని రాజరాజేశ్వర ట్రేడర్స్ రైస్‌మిల్లుకు తరలించాను. ట్రాక్‌షీట్, తూకం వేసిన ధాన్యం రిసిప్ట్ కూడా ఇచ్చారు. తీరా మిల్లుకు వెళ్లాక ఈ ధాన్యం దించుకోబోమని తెగేసి చెప్పారు. ఈ రకం సన్నరకం ధాన్యం తీసుకోమని చెప్పడంతో ప్రైవేట్‌లో తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోయిన. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.

– ఏనుగు స్వామిరెడ్డి, గ్రామం: నర్సింగాపూర్, మం: హాజీపూర్

ప్రజావాణి అర్జీలు పరిష్కరించాలి

- గైర్హాజరు అధికారులకు నోటీసులు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, పరిహారం, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే అర్జీలపై అధికారులు స్పందించాలని సూచించారు. ప్రజావాణికి గైర్హాజరైన ఎక్సైజ్, లెబర్ ఆఫీసర్, తదితర శాఖల అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏవోను ఆదేశించారు.

- ముఖ్యమంత్రి గిరి వికాస్(సీఎంజీవీఎస్) పథకం కింద నెన్నెల మండలం కోనపేట గ్రామానికి చెందిన ఎస్టీ రైతులైన తమకు అప్పటి ప్రభుత్వం బోర్లు మంజూరు చేసిందని, బోర్లు వేసి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదని అర్జీ అందజేశారు.
- ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించామని, తూకం సమయంలో బస్తాకు కిలోన్నర అదనం(గన్ని సంచి)గా బరువు కింద 41.300 కిలో తూకం వేశారని, మిల్లుకు వెళ్లిన తర్వాత రైస్‌మిల్లర్ అదనంగా మరో రెండు కిలోల చొప్పున కోతకు ఒప్పుకుంటేనే ధాన్యం దించుకుంటామని అంటున్నారని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు.

సీఏపై చర్యలు తీసుకోవాలి



కాసిపేట మండలం బుగ్గగూడేంలోని మహాలక్ష్మి గ్రూపునకు బ్యాంకు లోన్లు మంజూరు కోసం గ్రూపు సీఏ ఏదుల రాజయ్య మా వద్ద నుంచి రూ.5 వేలు తీసుకున్నాడు. మరో నందిని గ్రూపులోని సభ్యులకు కూడా లోను మంజూరుకు రూ.3 వేల చొప్పున వసూలు చేశాడు. లంచం ఇవ్వకుంటే లోన్లు ఎలా వస్తాయో చూస్తానని బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోవాలి.

– బుగ్గగూడ, కాసిపేట, గ్రూపు సభ్యులు

సారా అమ్ముతున్న టేల తొలగించాలి



మందమర్రి మండలం బొక్కలగుట్ట, తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధి గాంధారీ మైసమ్మ గుడి వద్ద అక్రమంగా టేలా ఏర్పాటు చేసి నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని టేలను తొలగించాలి. గుడి వద్ద ప్రతీ సంవత్సరం మూడు రోజులపాటు జాతర, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాం. కొంతమంది టేలలు ఏర్పాటు చేసి నాటు సారా విక్రయిస్తూ అపవిత్రం చేస్తున్నారు.

– కాసిపేట, జన్నారం మండలాల ఆదివాసీలు

అక్రమ ఇసుక రవాణా



జైపూర్ మండలం వేలాల, కిష్టపూర్ గ్రామాల మధ్య గోదావరి నుంచి కొందరు ఇసుకను సరిహద్దు గ్రామాల్లో డంప్ చేసి వరంగల్ నేషనల్ హైవే నిర్మాణం పేరిట టీసీఎండీసీ మైనింగ్ పేరిట నకిలీ వే బిల్లులతో రెవెన్యూ, మైనింగ్ అధికారుల కళ్లు గప్పి అక్రమ రవాణా చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఇవ్వడం లేదు. స్థానిక ట్రాక్టర్లకు ఉపాధి దొరకడం లేదు. – రేగుంట రాకేష్, ధర్మ సమాజ్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జి

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ధర్నా



ధర్నాలో సీపీఎం నాయకులు, నిరుపేదలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, చెన్నూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో చెన్నూర్ మండలానికి చెందిన నిరుపేదలు ధర్నా చేశారు. పార్టీ చెన్నూర్ ఏరియా కమిటీ కార్యదర్శి బొడెంకి చందు మాట్లాడుతూ చెన్నూర్ మండలం బాపురావుపేట శివారు ప్రభుత్వ భూమిలో 700మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు గుడిసెలు వేసుకుని మూడేళ్లుగా ఉంటున్నారని అన్నారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం..

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని జన్నారం మండలం చింతగూడెంకు చెందిన నిరుపేదలు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాల్‌కుమార్, టి.శ్రీనివాస్ మాట్లాడుతూ చింతగూడెం పంచాయతీ పరిధి సర్వే నంబరు 81లో అటవీశాఖ వివాదంగా ఉన్న భూమిని సర్వే చేయించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. సుమన్, మల్లేష్, రాజన్న, బ్రహ్మానందం, ప్రభాకర్ పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లలు, మహిళల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక, మానసిక, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, లోపం ఉన్న పిల్లలను గుర్తించి సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, అవసరమైన మందులు అందిస్తూ సాధారణ స్థితికి తీసుకవచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నాలుగు బాల్య వివాహాలను నిలిపివేశామని, 10 మంది పిల్లలకు కౌన్సెలింగ్ అందించి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

పనుల వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జలశక్తి అభియాన్ కార్యక్రమం కింద జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ పనుల వివరాలను శాఖల వారీగా జల్ సంచాయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, మున్సిపల్, అటవీ అధికారులతో జలశక్తి అభియాన్ కార్యక్రమం కింద చేపట్టిన పనులపై సమీక్ష సమవేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 9నుంచి చేపట్టిన పనుల వివరాలు నమోదు చేయాలని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు.

108అంబులెన్స్ ప్రారంభం

జైపూర్: భీమారం మండల ప్రజల సౌకర్యార్థం 108అంబులెన్స్ సేవలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ ప్రారంభించారు. నియోజకవర్గంలో రెండు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశామని, కోటపల్లి మండలంలో పాత వాహనం స్థానంలో కొత్తది మంజూరైందని తెలిపారు. వైద్యులు ప్రసాద్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణికి ఉజ్వల భవిష్యత్



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



స్టాల్స్ ను పరిశీలిస్తున్న జీఎం, ఇతర అధికారులు

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ
- ఆకట్టుకున్న స్టాళ్లు

శ్రీరాంపూర్: సింగరేణికి ఉజ్వల భవిష్యత్ ఉందని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ.సూర్యనారాయణ అన్నారు. సోమవారం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఘనంగా నిర్వహించారు. పతాకావిష్కరణ అనంతరం స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో మొదట్లో బొగ్గు ఉత్పత్తికి ఎంతో శ్రమ చేయాల్సి వచ్చేదని, క్రమేణా పెరిగిన టెక్నాలజీ, యంత్రాలతో పనులు సులువయ్యాయని తెలిపారు. నేడు బొగ్గు ఉత్పత్తితోపాటు ఇతర రంగాల్లో కూడా విస్తరిస్తోందని అన్నారు. సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోందని, దేశంలోనే సింగరేణిని నంబర్ వన్ సంస్థగా తీర్చిదిద్దారని తెలిపారు. రెస్క్యూ, ఎంవీటీసీ, మెడికల్, సేవా సమితి, ఏరియా వర్క్‌షాప్, సివిల్ డిపార్టుమెంట్‌లతోపాటు ఇతర కంపెనీ ఔన్నత్యాన్ని తెలిపే స్టాళ్లు ఏర్పాటు చేశారు. మైదానం మధ్యలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్, సింగరేణి లోగో, ఆర్కే 6 గని ఏర్పాటు చేసి ఎస్‌డీఎల్ యంత్రం నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రగతి మైదానంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీఎం ఎల్వీ.సూర్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులను కుటుంబ సభ్యులతో కలిపి శాలువాతో సత్కరించారు. ఉత్తమ సేవా సభ్యులను సన్మానించారు. ఇంటి ఆవరణలో పచ్చదనం, ఉత్తమ ఇంటి అలంకరణ విభాగంలో ఉత్తమ ఇళ్లను ఎంపిక చేసి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా ఎస్‌ఓటు జీఎం యన్.సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టీ.శ్రీనివాస్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏజెంట్లు రాజేందర్, వెంకటేశ్వర్లు, ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరబద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉద్యోగులకు బహుమతి ప్రదానం చేస్తున్న జీఎం ఎల్వీ సూర్యనారాయణ దంపతులు

క్లుప్తంగా

ఇసుక లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు భీంపూర్ ఏఎస్సై ముంతాజ్ తెలిపారు. సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. అందులో దాదాపు రూ.2 లక్షల విలువైన ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తనిఖీల్లో సిబ్బంది సుభాష్, ఆశిష్ పాల్గొన్నారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

ఇచ్చోడ: మండలంలోని ఎల్లమ్మగూడ అటవీ ప్రాంతంలో అక్రమంగా దాచి ఉంచిన కలపను సోమవారం పట్టుకున్నట్లు ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కలపను స్వాధీనం చేసుకుని సిరిచెల్మ ఫారెస్ట్ క్వాటర్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. గుండాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కలపను దాచిపెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. తనిఖీలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కవిత, బీట్ అధికారులు సజన్ లాల్, శ్యాంసుందర్, సుభాష్, సచిన్, స్వాతి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అటు నుంచి ఇటు.. వలస

- మంచిర్యాల జిల్లాకు వస్తున్న పొరుగు కూలీలు
- మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా నుంచి రాక..
- పత్తి సేకరణతో ఇంటిల్లిపాదికి ఉపాధి



సేకరించిన పత్తితో ట్రాక్టర్‌పై వెళ్తున్న రాజస్థాన్ కూలీలు



పత్తి ఏరుతున్న హర్యానా కూలీలు

నెన్నెల(బెల్లంపల్లి): ఒకప్పుడు మంచిర్యాల జిల్లాలో ఉపాధి లేక.. రైతులు, రైతు కూలీలు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు అనేక రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సాగునీరు అందుబాటులోకి వచ్చింది. సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో కూలీలకు పని దొరుకుతోంది. దీంతో వలసలు చాలా వరకు తగ్గాయి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు బతుకుదెరువు కోసం జిల్లాకు వలస వస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీల కొరత నెలకొన్న నేపథ్యంలో చాలామంది వలస కూలీలకు ఉపాధి దొరుకుతోంది. దీంతో పొరుగున ఉన్న మహారాష్ట్రతోపాటు, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల నుంచి రెండేళ్లుగా కూలీలు పెద్ద ఎత్తున జిల్లాకు వలస వస్తున్నారు. పిల్లా పాపలతో ముల్లె మూట సర్దుకుని వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి జిల్లాకు చేరుతున్నారు. నెన్నెల, బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూర్, కాసిపేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో కూలీ పనులకు వెళ్తున్నారు. వరినాట్లు, పత్తి ఏరే పనులకు ఇంటిల్లిపాదీ వెళ్తున్నారు. గ్రామాల శివారులో డేరాలు వేసుకుని నివాసం ఉంటున్నారు.

మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా నుంచి..

పత్తి ఏరేందుకు వలస కూలీలు మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల నుంచి బెల్లంపల్లి నియోజకవర్గానికి సుమారు 10 వేల మందికిపైగా కూలీలు వలస వచ్చారు. పిల్లాపాపలతో ఉదయం 6 గంటలకు పత్తి చేలకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి వస్తున్నారు. తమ గ్రామాల్లో పనులు లేక వలస వస్తున్నామని నెల రోజులు ఇక్కడ పనులు చేసిన తర్వాత తమ ప్రాంతాలకు తిరిగి వెళ్తామని కూలీలు పేర్కొంటున్నారు.

తినేందుకు తిండి లేక..

వలస కూలీలు నిరుపేదలు కావడంతో వీరికి తినేందుకు తిండి కూడా ఉండదు. ఏ పూటకు ఆ పూటే పనులు వెతుక్కుంటున్నారు. రెక్కాడితేనే ఆరోజు డొక్క నిండుతుంది. తల్లిదండ్రుల వెంట పిల్లలు కూడా పనికి వెళ్తున్నారు. పొద్దంతా కష్టపడితే రూ.400 నుంచి రూ.500 వరకు వస్తున్నాయని సీజన్ ముగిసే వరకు ఒక్కొక్కరు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు సంపాదిస్తామని కూలీలు పేర్కొంటున్నారు. మరోవైపు వలస కూలీల రాకతో జిల్లాలో కూలీల కొరత తీరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏటా వస్తున్నాం



నాలుగేళ్ల నుంచి పత్తి ఏరేందుకు వస్తున్నాం. మా దగ్గర పనులు దొరకవు. పోయిన ఏడాది వచ్చి రూ.30 వేలు సంపాదించిన. రైతులు మమ్మల్ని ట్రాక్టర్‌లో చేలకు తీసుకుపోయి తీసుకస్తరు. మా తోటివాళ్లు మంచిగా పత్తి ఏరి రూ.40 వేలు కూడా సంపాదిస్తున్నారు.

– కౌసల్యబాయి, వలస కూలీ (మహారాష్ట్ర)

కూలి గిట్టుబాటు అవుతోంది



మా ఊళ్లో పంటలు లేవు, పనులు దొరకవు. అందుకే పత్తి ఏరేందుకు వచ్చాం. నెల రోజులు ఇక్కడే ఉంటాం. రోజుకు రూ.600 వరకు గిట్టుబాటు అవుతుంది. పనులు అయిపోగానే వెళ్లిపోతాం. మా దగ్గర ఏవైనా చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం గడుపుతాం.

– సోహెల్, వలస కూలీ (రాజస్థాన్)

మా దగ్గర పని దొరకదు



మా రాష్ట్రంలో పంటలు సరిగా పండవు. అందుకే మేమంతా పిల్లాపాపలతో పత్తి ఏరేందుకు వచ్చాం. మా రాష్ట్రంలో పొద్దంతా పని చేసినా రూ.200 రావు. ఇక్కడ రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకు వస్తున్నాయి. మా కుటుంబం అంతా కలిసి పత్తి ఏరుతున్నాం.

– రషీద్, వలస కూలీ (హర్యానా)

పనులు దొరకక వచ్చాం



మా ఏరియాలో పనులు దొరకక ఇక్కడికి వచ్చాం. కూలీపై ఆధారపడి మేమంతా బతుకుతున్నాం. పొద్దటి నుంచి సాయంత్రం వరకు 80 కిలోల పత్తి ఏరుతా. కిలోకు రూ.10 చొప్పున రూ.800 వరకు వస్తాయి. కూలీ బాగానే ఉంది. చేతినిండా పని ఉంది.

– శోభ, వలస కూలీ (మహారాష్ట్ర)

'బలవంతపు మతమార్పిడిని ఉపేక్షించం'



మతప్రచారాన్ని అడ్డుకుంటున్న సభ్యులు

జన్నారం: బలవంతపు మతమార్పిడికి పాల్పడితే ఊరుకునేది లేదని హిందూవాహిని, ధర్మజాగరణ జిల్లా ప్రముఖ్ కొండగొర్ల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పొనకల్, జన్నారం గ్రామాల పరిధిలో కొందరు మతప్రచారం చేస్తుండగా అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మత ప్రచారం చేయడం సరికాదన్నారు. బలవంతపు మతమార్పిడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ధర్మజాగరణ, హిందూవాహిని నాయకులు నల్లపు కృష్ణ, శ్రీధర్, అరవింద్, తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

కుభీర్: మండలంలోని పార్డి(బి) రాజరాజేశ్వర ఆలయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి హుండీని పగులగొట్టే ప్రయత్నం చేశారు. శబ్దం విన్న గ్రామస్తులు కేకలు వేయగా కారులో భైంసావైపు పారిపోవడంతో 100కు సమాచారం ఇచ్చారు. గుండెగాం వద్ద కారు టైరు పేలిపోయి కల్వర్టును ఢీకొట్టి ఆగిపోవడంతో పోలీసులు వచ్చి కుభీర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. చోండిలోని దత్తాసాయి మందిరంలో చోరీకి యత్నించి సిలిండర్‌ను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు



నుజ్జునుజ్జయిన వాహనం

జన్నారం: మండలంలోని చింతగూడ సమీ పంలో ఆదివారం రాత్రి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన పలు వురు యువకులు కారులో జన్నారం నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటనలో వా హనంలోని ఇంజిన్ ఎగిరిపడింది. ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో చిన్నచిన్న గా యాలతో యువకులు బయటపడినట్లు తెలి సింది. ఘటనపై ఎస్సై రాజవర్ధన్‌ను సంప్రదించగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమే కానీ ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

తప్పిన పెను ప్రమాదం

సారంగపూర్: మండలంలోని ధని గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటన సమయంలో కారులో డ్రైవర్ విష్ణువర్ధన్ ఒక్కడే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అతివేగం కారణంగానే కారు అదుపుతప్పినట్లు ఆయన వెల్లడించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం



కొయ్యల శ్రీనివాస్ (ఫైల్)

నస్పూర్: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన కొయ్యల శ్రీనివాస్ (43) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందిన సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు లుంగీతో ఉరేసుకున్నాడు. మృతుని చిన్న కుమారుడు మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికులను పిలవడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

యువకుడిపై గొడ్డలితో దాడి

కుభీర్: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బొయిడి విజయ్‌పై గుర్తు తెలియని వ్యక్తి గొడ్డలితో దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. విజయ్ ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన మరోవ్యక్తితో కలిసి మద్యం సేవించడానికి కస్రా గ్రామానికి వెళ్లాడు. వెంట ఉన్న వ్యక్తి విజయ్‌ని కస్రాలో దించి కుభీర్‌కు వెళ్లాడు. మద్యం సేవించిన విజయ్ నడుచుకుంటూ గ్రామానికి వెళ్తుండగా వర్ని ఎక్స్‌రోడ్ వద్ద వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి గొడ్డలితో దాడిచేసి పారిపోయాడు. కుభీర్ వెళ్లిన వ్యక్తి వచ్చిచూడగా రక్తపుమడుగులో పడి ఉండడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చికిత్స నిమిత్తం ముందుగా భైంసాకు, అక్కడి నుంచి నిజమాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడు కోమాలో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై పీ.రవీందర్‌ను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు.

మృతదేహం లభ్యం

తిర్యాణి: మండలంలోని సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దానపూర్ అటవీ ప్రాంతంలో ఒకరి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపారు. గత నవంబర్‌లో దానపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రాజు వరుసకు అత్తమ్మ అయిన మారుబాయిపై హత్యాయత్నం చేసి విఫలం కావడంతో అటవీ ప్రాంతంలోకి పారిపోయాడు. ఆదివారం అడవిలోకి వెళ్లిన మేకల కాపరి టెకం రాజుకు అస్తిపంజరం, పక్కనే లుంగీ, స్వెటర్ కనిపించడంతో అనుమానం వచ్చి మృతుని తల్లి గంగుబాయికి సమాచారం అందించగా ఆమె అక్కడి చేరుకోని రాజు మృతదేహంగా గుర్తించింది. సోమవారం మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మాణిక్‌గూడ పరిసరాల్లో చిరుత సంచారం

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ వెల్లడించారు. సోమవారం అటవీశాఖ అధికారులు గ్రామ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో చిరుత పులి పాదముద్రలు గుర్తించినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం అడవిలోకి వెళ్లొద్దన్నారు. పత్తి తీసే రైతులు శబ్దాలు చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రాజేశ్, యానిమల్ ట్రాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన యువకులు

బెల్లంపల్లి: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఏఎంసీ ఏరియా నుంచి ద్విచక్ర వాహనంపై మంచిర్యాల వైపు వెళ్తున్న ఇద్దరు యువకులు ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. ఘటనలో తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన వంశీ, సాయి కిరణ్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

సర్సాపూర్(జి): ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై సాయి కిరణ్ తెలిపారు. లోకేశ్వరం మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన లావుడ్యా సూర్య, లావుడ్యా అరుణ్ సోమవారం ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా సర్సాపూర్ (జి) బస్టాప్ వద్ద బామ్ని (బి) గ్రామానికి చెందిన కదం సంతోష్ ఆటో నడుపుకుంటూ వచ్చి ఢీ కొట్టాడు. ఘటనలో సూర్య, అరుణ్‌కు గాయాలు కావడంతో 108లో భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెమీ ఫైనల్‌లో ఓడిన జిల్లా జట్టు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో అండర్ –14 విభాగంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు సోమవారం జరిగిన సెమీ ఫైనల్‌లో ఓటమి చెందినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. సెమీఫైనల్‌లో సెయింట్ ఆంథ్రోస్‌తో తలపడగా ఆ జట్టు 164 స్కోర్ సాధించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు 125 పరుగులకే ఆలౌట్ అయ్యి ఓటమి చెందిందని ఆయన పేర్కొన్నారు.

బాలిక అనుమానాస్పద మృతి



హరిత మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్‌లో అనుమానాస్పదంగా బాలిక మృతి చెందినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. గ్రామానికి చెందిన సీలం ఎల్లన్న, అంకవ్వ దంపతుల చిన్నకూతురు హరిత (12) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరోతరగతి చదువుతోంది. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లకుండా చేనుకు కాపలాగా వెళ్లింది. ఇదే తరుణంలో కిందపడి పోయి మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్తి ధరను తగ్గించిన సీసీఐ

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో సీసీఐ పత్తి ధరను తగ్గించింది. ఇది వరకు క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521 ఉండగా రూ.7,471కి తగ్గించారు. బీబీ స్పెషల్ మోడ్ రకం పత్తి వస్తోందని, అందుకే పత్తి ధరను తగ్గితస్తున్నట్లు సీసీఐ అధికారులు పేర్కొన్నారని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రామకృష్ణాపూర్: పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో సోమవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక గీతాలాపనలు అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమ, కరుణ, దయాగుణం కలిగిన ఏసుక్రీస్తు బోధనలు అందరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కాంగ్రెస్ నాయకులు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పల్లె రాజు, సీఎస్ఐ పాస్టర్ జాషువా, సెక్రెటరీ డొల్కల డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ ఎంపిక పోటీలు



ఉమ్మడి జిల్లా బాలికల జట్లతో నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ జట్టు సీఎం కప్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి 96 మంది బాలబాలికలు పాల్గొనగా 12 మంది బాలురు, 12 మంది బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, డీవైఎస్‌వో రాజ్‌వీర్, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, కోశాధికారి గాజుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. వంతెన నిర్మించాలని గాదిగూడ మండలం మారుగూడ గ్రామస్తులు, విద్యుత్ బోర్ మంజూరు చేయించాలని సిర్పూర్(టి)మండలం భూపాలపాలెం గ్రామానికి చెందిన సిడాం వెంకట్, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా మంజూరు చేయాలని సిర్పూర్(యూ) మండలం షెట్టిహడప్‌నూర్ గ్రామానికి చెందిన వెడ్మ చిన్ను కోరారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

చపాతీ కర్రీలో స్టీల్ స్క్రబ్బర్ ముక్క

- మంచిర్యాలలోని ఓ హోటల్‌లో ఘటన



కర్రీలో వచ్చిన స్టీల్ స్క్రబ్బర్ ముక్క

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ హోటల్‌లో ఈ నెల 22న రాత్రి ఓ వినియోగదారుడు టిఫిన్ చేసేందుకు వెళ్లి చపాతీ ఆర్డర్ చేశాడు. చపాతీతో పాటు హోటల్ సర్వర్ తీసుకొచ్చిన కర్రీలో స్క్రాబర్ ముక్క కనిపించడంతో నిర్వాహకులను నిలదీశాడు. అది స్టీల్ స్క్రబ్బర్ ముక్క అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ హోటల్‌లో వరుస ఆహార కల్తీ పదార్థాలు జరిగిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల ఓ వినియోగదారుడు ఉప్మా పార్సిల్ ఆర్డర్ చేశాడు. ఇంటికి వెళ్లి చూసేసరికి అందులో చనిపోయిన ఎలుక లభించింది. గతంలో వెజ్ బిర్యానీలో బొద్దింక లభించిన ఘటనలూ ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రతీ హోటల్‌లో సంబంధిత శాఖ అధికారుల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయల్సి ఉండగా నిర్వాహకులు తుంగలో తొక్కేస్తున్నారు. ఈ విషయమై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు, హోటల్ యజమానిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.

ఘనంగా సింగరేణి డే వేడుకలు



పర్యావరణ విభాగం ఏర్పాటు చేసిన స్టాల్



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: సింగరేణి ఆవిర్భావ వేడుకలను సోమవారం మందమర్రి ఏరియాలో ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయం వద్ద, సింగరేణి హైస్కూల్ మైదానంలో జీఎం దేవేందర్ సింగరేణి జెండాను ఎగురవేశారు. మైదానం ఆవరణలో ఏర్పాటు చేసిన పలు విభాగాల స్టాల్స్‌ను సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి ప్రారంభించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం సింగరేణి స్థితిగతులను వివరించారు. 135 సంవత్సరాల చరిత్రలో సింగరేణి ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొందని అన్నారు. దేవ్యాప్తంగా వ్యాపార రంగంలో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తూ పోటీ రంగంలో సింగరేణి ముందు వరుసలో ఉందన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.